పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# ఆధునిక హంగులతో మోడల్ రైతు బజారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్




**గుంటూరు , పెన్ పవర్:ఆగస్ట్, 27,**మంగళగిరి అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. నిడమర్రు రోడ్డులో రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక మోడల్ రైతు బజారు నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు.5.90 ఎకరాల విస్తీర్ణంలో రిటైల్, హోల్‌సేల్ మార్కెట్లుగా ఈ మెగా కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. రైతులు తమ ఉత్పత్తులను సులభంగా విక్రయించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు అందేలా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపడుతున్నారు.ఈ మార్కెట్‌లో 102 కూరగాయల స్టాళ్లు, 54 పండ్లుపూల స్టాళ్లు, ఇతర వస్తువుల విక్రయాలకు 60 ప్రత్యేక షాపులు ఏర్పాటు చేయనున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లు, 23 కూరగాయల షాపులు అందుబాటులోకి రానున్నాయి.అదనంగా కోల్డ్ స్టోరేజీ, కూరగాయల శుభ్రపరిచే ప్రదేశం, క్యాంటీన్, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. సౌర విద్యుత్, సేంద్రియ వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి ఆధునిక సదుపాయాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు.అరబిందో ఫార్మా ట్రస్ట్ సామాజిక బాధ్యత నిధులతో నిర్మించనున్న ఈ మోడల్ రైతు బజారు అందుబాటులోకి వస్తే రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

# కారుమంచికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్‌లో కీలక బాధ్యత

**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 27**

గూడూరు మండలం ఆకుమర్రు గ్రామానికి చెందిన కారుమంచి కామేశ్వరరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన పెడన నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఉప్పాల రాము, జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి



ధన్యవాదాలు చెప్పారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా పెడన నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. ఉప్పాల రాము నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే వరకు తన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తానన్నారు. కామేశ్వరరావు నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# వర్ల రామయ్యను కలిసిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యే రామాంజనేయులు వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. పార్టీకి వర్ల రామయ్య అందించిన సుదీర్ఘ సేవలు, రాజకీయ అనుభవం, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ఎమ్మెల్యే కొనియాడారు. ఎమ్మెల్సీ పదవి ఆయన సేవలకు దక్కిన సముచిత గౌరవమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వర్ల రామయ్య, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కొద్దిసేపు రాజకీయ, పార్టీ వ్యవహారాలపై ఆత్మీయంగా చర్చించారు. వర్ల రామయ్యకు ఎమ్మెల్సీ పదవి దక్కడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, అన్నాబత్తుని జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పెదకాకాని భ్రమరాంబ అమ్మవారికి

# మంగళ సూత్రాలు సమర్పించిన అంబటి మురళీకృష్ణ.



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 27,**

ఇటీవల పవిత్ర శ్రావణ మాసంలో విశిష్ఠ వరలక్ష్మి పూజా కాలంలో, ప్రసిద్ధి గాంచిన కాకాని దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారి మంగళసూత్రం అపహరణ జరిగిన సంగతి ప్రజలందరికీ తెలిసిన విషయమే ,ఈ అపశృతికి,మహా అపచారానికి అమ్మవారిని మన్నింపు కోరుతూ, యధావిధిగా ఆదిపరాశక్తి,లోకమాత అనుగ్రహం ప్రజలందరికీ దక్కాలని ఆ అమ్మను ప్రార్థిస్తూ,అమ్మవారి నామాల నగర సంకీర్తన కార్యక్రమం పొన్నూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం పెదకాకాని పోలీస్ స్టేషన్, సాయిబాబా గుడి ఎదురుగా వై జంక్షన్ వద్ద ఉన్న శ్రీ వరలక్ష్మి అమ్మవారి దేవాలయం నుండి ఘనముగా ప్రారంభమై, కాకాని పట్టణంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం వరకూ అత్యంత భక్తి పారవశ్యంతో,అమ్మవారి నామాలతో మారు మోగిపోయింది.ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 14వ తారీఖున కనిపించకుండా పోయిన అమ్మవారి నాన్తాడు మంగళ సూత్రం గురించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెళితే పోలీసులు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రోద్బలం తో కేసు కట్టకుండా తాత్సారం చేయడంలో వెనుక ఉన్న కుట్ర ఏమిటో బహిర్గతం చేయాలని.20 వ తారీఖున తానే స్వయంగా కాకాని పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేసి అనంతరం అక్కడ నుండి పాదయాత్రగా బయలుదేరి భ్రమరాంబ అమ్మవారి దేవస్థానం వరకు వచ్చి పూజలు చేసి మంగళసూత్రం దొంగతనం చేసిన వారిని తక్షణమే శిక్షించాలని సాక్షాత్తు ఆ లోక మాత భ్రమరాంబ అమ్మవారికి వేడుకోవడం జరిగిందని.గత రెండు రోజుల క్రితం నా కన్నతల్లి నా కలలో కనిపించి నా పసుపు కుంకుమ నీ సోదరీమణులు దగ్గర ఉన్నవి అవి పెట్టి ఆ తల్లికి మంగళసూత్రం సమర్పరించమని చెబితే ఈరోజు మంగళసూత్రాలు ఎంతో భావోద్వేగంతో ఆ భ్రమరాంబా దేవికి సమర్పించానని. నా తల్లిదండ్రులు నన్ను కారణజన్ముడిగా కన్నది పొన్నూరు నియోజకవర్గంలోని ప్రజలకు సేవ చేయడమే కాకుండా ఈ భ్రమరాంబా దేవికి మంగళసూత్రాన్ని సమర్పించడానికేనని అనిపించిందని భావోద్వేగానికి లోనయ్యారు.గతంలో వడ్డాణం పోయినప్పుడే దొంగలను పట్టుకున్నట్టయితే ఈ దుస్థితి మరల సంభవించేదే కాదని. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఒత్తిడితో స్థానిక పోలీస్ అధికారులు పూజారులు అందరిని పిలిపించి ఒక్కొక్కరు 50 వేలు వేసుకొని మంగళ సూత్రాలు చేయించమని ఒత్తిడి



తెచ్చిన మాట వాస్తవం కాదా! అని.ఈ దేవాలయానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ బసవ శంకర్ పూజారులందరిని బెదిరించి వారిపై ఒత్తిడి చేసిన మాట వాస్తవం కాదా అని. ఇలా ధూళిపాళ్ల అక్రమాలు చెప్పుకుంటూ పోతే ఈ నియోజకవర్గంలో చాలా ఉన్నాయని ఇలాంటి పాపాల భైరవుడుని ఆ భ్రమరాంబ దేవి రేపు రాబోవు 2029 శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తరిమి తరిమి కొట్టేలా శిక్షిస్తుందని దుయ్యబట్టారు.రాబోవు రోజుల్లో శ్రీ భ్రమరాంబ అమ్మవారికి నాన్తాడు కూడా పొన్నూరు నియోజకవర్గంలోని భక్తులందరూ కలిసి తయారు చేసి ఇచ్చే విధంగా తన వంతు సహాయం చేస్తానని తెలియజేశారు.తదనంతరం ఆళ్ల వీరరాఘవమ్మ చేతుల మీదగా నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులందరికీ నైవేద్య,తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల , భక్తులు మరియు పలు అనుబంధ విభాగాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం

# అండగా ఉంటుంది ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**


మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, మహిళలకు ఉపాధి కల్పించే ప్రతి ప్రయత్నానికి ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.గుంటూరు వికాస్‌నగర్‌లో మదర్ తెరీసా బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.తొలి విడతగా 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించడంతో పాటు, సాధారణంగా రూ.8 వేల విలువైన ఉషా కుట్టు మిషన్లను రాయితీపై రూ.4 వేలకే అందించడం అభినందనీయమన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మదర్ తెరీసా బహుజన సేవా సమితి చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.జిల్లా వ్యాప్తంగా



సుమారు 50 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందని, ఈ లక్ష్య సాధనకు కటకం శెట్టి విజయలక్ష్మి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షకు, ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరిన్ని బ్యాచ్‌ల ద్వారా పెద్ద సంఖ్యలో మహిళలకు టైలరింగ్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను పరిశీలించిన

# జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్




**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 27:**

గుంటూరు నగరంలో అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సి యం.సాయి కాంత్ వర్మ గురువారం పరిశీలించారు.రెండంతస్తుల భవనం మొత్తాన్ని కలియతిరిగి పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. భవనంలోని వివిధ విభాగాలు, నిర్మాణ పనుల పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ భవనాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు.అనంతరం అంబేద్కర్ భవనం పక్కనే ఉన్న బుద్ధశ్రీ ఆర్కియాలజికల్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. మ్యూజియంలోని చారిత్రక, పురావస్తు ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిశీలించి, వాటి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిల్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి




దుర్గాబాయి, తహసీల్దార్ కిరణ్, నిర్వాహకులు మేడిద బాబూరావు తదితరులు ఉన్నారు.

# పెడన మండలంలో రేపు ఎస్ఎల్ఏఎస్ సర్వే పరీక్ష

**పెడన, పెన్ పవర్, ఆగస్టు 27**

మండలంలోని ఎంపిక చేసిన ఏడు పాఠశాలల్లో ఈ నెల 28న స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఎల్ఏఎస్) పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ-1 ఎన్. సలోమి తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.నందిగామ, కాకర్లమూడిపాలెం ప్రాథమిక పాఠశాలలతో పాటు పెనుమల్లి ఉన్నత పాఠశాల, బట్ట జ్ఞాన కోటయ్య హైస్కూల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, సెయింట్ విన్సెంట్ పల్లోట్టి హైస్కూల్ తదితర పాఠశాలల్లో 5, 7, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలో పరీక్షలు నిర్వహించనున్నారు.పరీక్ష నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. పరీక్ష విధానం, మార్గదర్శకాలు, నిర్వహణపై వారికి శిక్షణ ఇచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. ఎంఈఓ-2 వై.వి. హరనాథ్



పరీక్షకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

## లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో

# క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కార్యక్రమం



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 27,**

లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చలమయ్య కాలేజీలో, లాలాపేట ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, అధ్యాపకుల సమక్షంలో మహిళల భద్రత, మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ మరియు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో "క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్" కార్యక్రమాన్ని నిర్వహించారు..ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలు, వేధింపులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి, ఎటువంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించడం జరిగింది. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, లాలాపేట ఎస్సై తెలియజేశారు.

## శనివారం దివ్యాంగులకు,

# ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 27 :**

దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక గ్రీవెన్స్ ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరుగుతుందని చెప్పారు. జిల్లా అధికారులు అందరూ హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**
గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉండాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఇంటి నంబర్ల వివరాలను పట్టణ ప్రణాళిక అధికారులు, ఆర్‌ఐలు సమన్వయంతో పరిశీలించాలని సూచించారు.ఎన్నికల విధుల కేటాయింపులకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, రిసెప్షన్ కేంద్రం, లెక్కింపు కేంద్రాలకు అవసరమైన హాళ్లను గుర్తించాలని సిటీ ప్లానర్‌కు సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేనేజర్‌ను ఆదేశించారు.ఎన్నికల నోటీసులపై విచారణను క్షుణ్ణంగా చేపట్టాలని, ప్రతి నోటీసును పూర్తిస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఏఈఆర్‌ఓలు ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సమావేశంలో డిప్యూటీ కమిషనర్ జి. సాంబశివరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డిప్యూటీ తహశీల్దార్లు నాగ మల్లేశ్వరరావు, కిరణ్మయి, మేనేజర్ బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి
### : సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం, పెన్ పవర్ ఆగష్టు 27**
మదర్ థెరిసా ప్రపంచంలో సేవకు ప్రతిరూపమని సమితి గౌరవ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. మచిలీపట్నం నవచైతన్య మదర్ థెరిసా సేవా సమితి 20వ వార్షికోత్సవం, మదర్ థెరిసా జన్మదిన వేడుకలను బుట్టయ్యపేటలోని కాశీనాధుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్ట్ దివ్యాంగుల హోమ్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విదేశంలో జన్మించినప్పటికీ భారతదేశ ప్రజల హృదయాల్లో మదర్ థెరిసా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఆమె సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మచిలీపట్నం చిలకలపూడి సెంటర్‌లో మదర్ థెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం తమ సేవా సమితికి లభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.గత 20 ఏళ్లుగా సమితి ఆధ్వర్యంలో వందలాది సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వేసవిలో 17వ డివిజన్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు, కుష్ఠు రోగులకు సేవలు, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల హోమ్‌లో వార్షికోత్సవం నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ మరింత విస్తరిస్తామని బాలాజీ తెలిపారు.

## మహిళా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్:ఆగస్ట్, 27,**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన మహిళల నుంచి ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా అర్జీలను స్వీకరించారు.మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేలా వాతావరణం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి, నిర్ణీత సమయంలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## ఎంఎస్యూ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ . మయూర్ అశోక్




**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**
ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు మెట్రోపాలిటన్ సర్వైవల్ యూనిట్ల (ఎంఎస్యూ) పాత్ర ఎంతో కీలకమని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.గురువారం గుంటూరు మెడికల్ కాలేజీలో నిర్మాణంలో ఉన్న ఎంఎస్యూ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 ప్రాంతాల్లో ఎంఎస్యూ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంఎస్యూ నిర్మాణానికి అనుమతి లభించిందని తెలిపారు. వ్యాధుల వ్యాప్తిని ముందుగానే గుర్తించి, సమర్థవంతమైన స్పందన చర్యలు చేపట్టేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఎంఎస్యూను త్వరగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గుంటూరును ఆరోగ్య గుంటూరుగా తీర్చిదిద్దేందుకు మరింత దోహదపడుతుందని కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం ప్రతినిధి వై. శ్రీనివాస్, ప్రయోగశాల నిపుణులు జితేందర్ పాండే తదితరులు పాల్గొన్నారు.

### మంగళగిరిలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
## - మహిళా సోదరీమణులకు వేమారెడ్డి శుభాకాంక్షలు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 27,**
మంగళగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ వాతావరణంలో కార్యాలయం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా నియోజకవర్గ మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ దొంతిరెడ్డి వేమారెడ్డి కి ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం వేమారెడ్డి మాట్లాడుతూ.అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. నా సోదరీమణులందరూ నాకు రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉంది. నియోజకవర్గంలోని ప్రతి మహిళా సోదరికి నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. మీ రక్షణ బాధ్యత నాది.మీకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఉన్నా నేరుగా నన్ను కలవవచ్చు. మీకు అండగా నేనుంటాను.మహిళల సంక్షేమం కోసం వైఎస్ఆర్సీపీ ఎప్పుడూ ముందుంటుంది. జగన్మోహన్ రెడ్డి మహిళలకు ఇచ్చిన గౌరవం, భరోసా మరే పార్టీ ఇవ్వలేదు. ప్రతి కుటుంబంలో ఈ రాఖీ పౌర్ణమి ఆనందం, సంతోషం నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగ్ జాయింట్ సెక్రెటరీ షాలిని, గుంటూరు డిస్ట్రిక్ట్ యాక్టివిటీ మెంబెర్ మల్లవరపు సుధారాణి, మంగళగిరి టౌన్ మహిళా విభాగ ప్రెసిడెంట్ సాంకే సునీత, తాడేపల్లి టౌన్ మహిళా విభాగ ప్రెసిడెంట్ దర్శి విజయశ్రీ, మంగళగిరి మండలం వాలంటీర్ విభాగ అధ్యక్షురాలు కే. నీలిమ, టౌన్ మహిళా ఉపాధ్యక్షురాలు కే స్వరూపారాణి, టౌన్ మహిళా కార్యవర్గ సభ్యులు అందే సుజాత, టౌన్ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి తుమ్మ పద్మ, టౌన్ మహిళా కార్యదర్శి ఆర్ అంజలి, టౌన్ కార్యదర్శి దుర్గా, వార్డు ప్రెసిడెంట్ ఎస్.కె షంషద్, వార్డు



ప్రధాన కార్యదర్శి అఫ్రీన్ పర్వీన్, శ్రావణి, టౌన్ మహిళా కార్యదర్శి కొన్ని హైమా, వార్డు ప్రధాన కార్యదర్శి జ్యోతి, వార్డు కమిటీ మెంబర్ బి దివ్య, తాడేపల్లి పట్టణం నుండి ఎనిమిదవ వార్డు ప్రధాన కార్యదర్శి దర్శి సునీత, 8వ వార్డు బ్రహ్మానందపురం మహిళా అధ్యక్షురాలు బోడపాటి ఉమాదేవి, ఎర్రం శెట్టి భాను, తాడేపల్లి పట్టణ మహిళా కార్యదర్శి శకినబి, తాడేపల్లి ఐదవ వార్డు మహిళా అధ్యక్షురాలు వారణాసి గౌరీ, కమల, మార్తమ్మ, మేరీ, అనిత, స్వప్న మరియు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## భ్రమరాంబ అమ్మవారి మంగళసూత్రం మాయం ఘటనపై టీడీపీ నాయకుల అనుమానాలు

**గుంటూరు , పెన్ పవర్, ఆగస్ట్, 27,**
శ్రీ భ్రమరాంబ అమ్మవారి మంగళసూత్రం మాయం అయిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని పెదకాకాని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నాయకుల పాత్రపై తమకు అనుమానాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి అలంకరణ పూజలు నిర్వహించిన సమయంలో మంగళసూత్రం అమ్మవారి మెడలో ఉన్నట్లు, అనంతరం ఆలయ పూజారి విశ్వనాథ్ ఈ విషయం గుర్తించి ఆలయ అధికారులు, ఇతర పూజారులకు సమాచారం అందించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. విషయం స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి వెళ్లడంతో పోలీసులకు సమాచారం అందించి విచారణ ప్రారంభించినట్లు చెప్పారు.అమ్మవారి మంగళసూత్రం మాయం ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఇప్పటికే స్పష్టం చేశారని టీడీపీ నాయకులు గుర్తు చేశారు.



పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి వాస్తవాలను వెల్లడించేందుకు సమయం ఇవ్వాలని కోరారు.అయితే వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి మురళి పదేపదే మంగళసూత్రం ఒక నిర్దిష్ట తేదీన మాయమైందంటూ ప్రకటనలు చేయడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆయన చేస్తున్న వరుస వ్యాఖ్యలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు. తాజాగా బంగారం తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించేందుకు వచ్చానని అంబటి మురళి చెప్పడంపైనా వారు ప్రశ్నలు సంధించారు.అమ్మవారి ఆలయ ప్రతిష్ట, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఘటనపై రాజకీయ విమర్శలు, ఆరోపణలు చేయకుండా పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని సూచించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు.పొన్నూరు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌పై విశ్వాసంతో పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని పేర్కొంటూ, ఆయనపై చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ నాయకులు అన్నారు.
అమ్మవారి మంగళసూత్రం, నాంతాడు మాయం ఘటనపై పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెదకాకాని టీడీపీ నాయకులు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మండలానికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు సమష్టి కృషి ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ




**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 27:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పురోగతిపై జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ వరకు అధికారులు సమష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసులు పంపిణీ చేయగా, 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తయిందని తెలిపారు. నోటీసుల పంపిణీ, విచారణలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ, మిగిలిన జిల్లాలు కూడా నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.వృద్ధాప్యం, అనారోగ్యం తదితర కారణాలతో విచారణకు హాజరుకాలేని ఓటర్లకు బీఎల్వోల సమన్వయంతో ఇంటి వద్దే అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. విచారణ అనంతరం ఏఈఆర్‌వోలు నిబంధనల ప్రకారం న్యాయమైన తుది నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్వోలు, బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం కీలకమని డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. ఓటర్ల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఫారం-6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలపై




## టాప్ మోస్ట్ ఐపీఎస్‌ల పరిస్థితి ఇదేనా? రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 27,**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవహరించిన సీనియర్ ఐపీఎస్ అధికారుల పరిస్థితి ఇప్పుడు 'ఇంత బతుకు బతికి ఇంటెనకాల చచ్చిన' చందంగా మారిందని తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య విమర్శించారు.వైసీపీ ప్రభుత్వంలో నిఘా విభాగం చీఫ్‌గా పనిచేసిన పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రస్తుతం సస్పెన్షన్‌లోనే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాదంబరి జెత్వానీ కేసులో ఆయన అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చారని, గ్రూప్-1 పరీక్ష పేపర్ల మూల్యాంకన వ్యవహారంలోనూ



ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండేళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్న ఆయనకు ఎలాంటి పోస్టింగ్ లేకుండానే ఈ నెల 31న సర్వీస్ ముగియనుందని పేర్కొన్నారు.మాజీ సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ కూడా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై 2024 డిసెంబర్ నుంచి సస్పెన్షన్‌లో ఉన్నారని లక్ష్మయ్య తెలిపారు. ప్రభుత్వం వివరణ కోరినా సమాధానం ఇవ్వకపోవడంతో విచారణకు అధికారి నియమించారని చెప్పారు. మరికొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనున్న సంజయ్ కూడా సస్పెన్షన్‌లోనే ఇంటికి వెళ్లే పరిస్థితి కనిపిస్తోందన్నారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కాలమే సరైన సమాధానం చెబుతుందని, ఈ ఇద్దరు అధికారుల ప్రస్తుత పరిస్థితి అందుకు నిదర్శనమని రాచకొండ లక్ష్మయ్య అన్నారు.

## ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడతాం ఎమ్మెల్యే నసీర్





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 27,**
నియోజకవర్గంలోని ఎన్నో ఏళ్లుగా వెనకబడిన ప్రాంతమైన ప్రగతి నగర్లో అభివృద్ధికి పట్టం కడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రగతి నగర్, బాలాజీ నగర్ నందమూరి కాలనీ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్ల నిర్మాణానికి రూ. 8.75 కోట్లతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రెయిన్లు, రోడ్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం రోడ్లు నిర్మాణం చేపట్టిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మారుమూల కాలనీలకు మంచినీళ్లు కూడా అందించలేదని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వంద కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని తెలిపారు. తల్లికి వందనం అమలుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. ఇప్పటికే గూగుల్ వంటి పెద్ద సంస్థలు రాష్ట్రానికి తరలివచ్చాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

# ఐదు వందల గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దుటకు చర్యలు



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 27 :**
జాతీయ వాదానికి సంస్కృతమే ఊతమని రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ ఏ శరత్ చంద్ర అన్నారు. ఐదు వందల గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దుటకు చర్యలు చేపట్టామని చెప్పారు. గుంటూరులో శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాలలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ సౌజన్యంతో
తెలుగు మరియు సంస్కృత అకాడమీ సంస్కృత సప్తాహం వారోత్సవాలలో భాగంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతం అమృత భాష అన్నారు. సంస్కృతం పండితుల భాషగా ప్రజల్లో నానుడి ఉందని దాన్ని చెరిపివేసి సామాన్యులకు సంస్కృత భాష చేర్చే కార్యాచరణ అకాడమీ చేపడుతుందని చెప్పారు. "అందరికీ సంస్కృతం - అందరిలోకి సంస్కృతం" శీర్షికన ముందుకు వెళుతున్నామని చెప్పారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సౌజన్యంతో అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో రూ.5 వందల కోట్లతో నిర్మించుటకు ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు అనుబంధంగా 100 పడకల ఆయుర్వేద వైద్యశాల రానుందన్నారు. బహుళ ప్రయోజనాలు సమకూర్చే సంస్కృత విశ్వవిద్యాలయం
వల్ల ఆంధ్రప్రదేశ్ లో సంస్కృత అకాడమీ అభివృద్ధి చెందుతుందని, పుస్తకాలు మొత్తం ప్రింటింగ్ చేసే అవకాశం కూడా వస్తుందన్నారు.
సంస్కృత సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న శ్రీకాకుళం, విజయనగరం లలో, 26న విశాఖపట్నం, కొవ్వూరులలో, 27న తణుకు, గుంటూరులలో నిర్వహించామన్నారు.
28న జిల్లెళ్ళమూడి, నెల్లూరులలో,
29న తిరుపతి, కడపలలో, 30న అనంతపురం, కర్నూలు లలో, 31న గుడివాడ, విజయవాడ లలో జరుపుతున్నామని చెప్పారు. సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమం విజయవాడలో ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత కళాశాలలో జరుగుతుందన్నారు. సప్తాహం కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు భారతం, భాగవతంతో పాటు ఇతర క్విజ్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సంస్కృతంలో విశేష కృషి చేసిన వారికి
సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగష్టు 29న తెలుగు భాషను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన గిడుగు రామూర్తి జయంతికి తెలుగు భాషా, తెలుగు సంస్కృతికి విశేషంగా కృషి చేసిన తెలుగు భాషా ప్రముఖులకి అవార్డు బహుకరణ ఉంటుందన్నారు.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి
సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ శ్రావణ పౌర్ణిమ రోజున సంస్కృత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శారద నికేతనానికి మహాత్మా గాంధీ విచ్చేశారని, ఇది గొప్ప ముదావహం అన్నారు.
ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సంస్కృతం గొప్ప భాష అన్నారు. ఉపాధి కల్పించడంలో సఫలీకృతం చేయడం ద్వారా యువత భాషను నేర్చుకోవడానికి ముందుకు వస్తారని చెప్పారు. సంస్కృత భాష మధురమైన భాష అని పేర్కొన్నారు. సంస్కృత భాషలో ఉన్న జ్ఞానాన్ని అందించి, ఆకర్షితులను చేయాలని సూచించారు. భాషను బ్రతికించుటకు అన్ని అవకాశాలు వెతకాలని అన్నారు. సంస్కృత సప్తాహం అనే మంచి కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయుటకు పూనుకోవడం ముదావహం అన్నారు. కొత్త ఆలోచనలతో సంస్కృత భాషను వ్యాప్తి చేయాలని కోరారు.
ఉత్సవ ప్రముఖులు డా. దీవి నరసింహ దీక్షిత్ మాట్లాడుతూ సంస్కృత భాష సరళమైన భాష అని చెప్పుటకు ఏర్పాటు చేసిన మంచి కార్యక్రమం అన్నారు. ఇంటి ఇల్లాలు సంస్కృతం మాట్లాడితే ఇల్లు అంతా సంస్కృతం మాట్లాడుతుందన్నారు. సంస్కృత సప్తాహం గొప్ప వినయ యాత్ర అన్నారు. సంస్కృత భాషను వ్యాప్తి చేయుటకు ప్రతి ఒక్కరి కృషి అవసరం అన్నారు. సంస్కృత విద్యార్థి పి.శ్రీవాణి మాట్లాడుతూ సంస్కృత భాష వైశిష్ట్యాన్ని వివరించారు.
సంస్కృత పండితులు డా. పి.టి.జి రంగాచార్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, సంస్కారానికి సంస్కృత భాష గొప్ప వారధి అన్నారు. భారతీయులు అందరూ సమష్టిగా భాషను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.
సంస్కృత పడితులు - డా. శ్రిష్టి లక్ష్మీ కుమార శర్మ, డా. ఆకెళ్ళ మల్లు సోమయాజులు, సుఖవాసి
మల్లిఖార్జునరాయ శాస్త్రి, కూనిశెట్టి
స్వరాజ్య లక్ష్మి లను ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో తెలుగు, సంస్కృత అకాడమీ ఉప సంచాలకులు డా. పి. కోటిరత్నం, శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాల కార్యనిర్వహణ టి.శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు ఆరిఫ్ బేగ్,
కార్యనిర్వాహకులు డా.మరుధూరి నరసింహాచార్య, డా. పి. దేవేంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



# చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం..

## - 7 మంది మృతి..




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :**
పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండల పరిధిలోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు.
ఈ ప్రమాదంలో మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందినవారిగా సమాచారం. ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.మృతుల్లో ఆరుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మృతులను బొంత బాబు (62), బొంత మనెమ్మ (55), సంపూర్ణమ్మ (70), లక్ష్మమ్మ (75), గంగమ్మ (50), చౌటుపల్లి సువర్త (45), మరియమ్మ (45)గా గుర్తించారు.

<u>అర్ధరాత్రి 12.45 గంటలకు ప్రమాదం</u>

అడ్డా రోడ్ సమీపంలో అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బస్సుఆటో ఢీకొనడంతో ఆటోలో ఉన్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. నలుగురు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు గుంటూరు జీజీహెచ్, చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.గాయపడిన ఎనిమిది మందిలో నలుగురు చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# వేర్వేరు దొంగతనాల్లో నేరస్తుల అరెస్టు

## - చాకచక్యంగా వ్యవహరించిన భట్టిప్రోలు పోలీసులు

**భట్టిప్రోలు, పెన్ పవర్ ఆగస్టు, 27:**
వేర్వేరు ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన నేరస్తులను అదుపులోకి తీసుకున్న ఘటన భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.భట్టిప్రోలు కు చెందిన ఒక చోరీ కేసుకు సంబంధించిన దొంగను మరియు పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న అంతర్ జిల్లాల దొంగ వడ్డ మణికంఠ ను గురువారం భట్టిప్రోలు పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసులకు సంబంధించి రేపల్లె డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం 7వ నెల 25 వ తేదీ భట్టిప్రోలు పెదమాలపల్లిలో నివాసం ఉంటున్న మేడపల్లి ప్రసన్నకుమారి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లడం జరిగింది.ఈ అదును కోసం ఎదురుచూస్తున్న ఇంటి ఎదుటి వ్యక్తి జంగం సతీష్ అలియాస్ సామియేలు ఆమె తలుపు పక్కనే ఉన్న కిటికీ వెంబడి దాచిన తాళం చెవిని తీసుకొని ఇంట్లోకి చొరబడ్డాడు.ఇంట్లో ఉన్న బంగారపు నాను త్రాడు, ఒక ఉంగరం,కొంత నగదు తదితర వస్తువులను దొంగిలించి అమ్మడం జరిగిందని తెలిపారు.వేసి ఉన్న తాళం పగలగొట్టి భట్టిప్రోలుతో పాటు పలు ప్రాంతాలలోను అదేవిధంగా ఇరుగుపొరుగు జిల్లాలలో సైతం దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి మణికంఠను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.వడ్డ మణికంఠ అనే వ్యక్తి ఈజీ మనీకి అలవాటు పడి దుర్వసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు.జులై 31వ తేదీ రాత్రి సమయంలో భట్టిప్రోలులోని అంజి వైన్స్, సాయి మెడికల్స్,లక్ష్మీ వెంకటేశ్వర మెడికల్స్ తదితర షాపులలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. మణికంఠ వద్ద నుండి 25 వేల రూపాయలు నగదు, ఒక మోటరు సైకిల్ రికవరీ చేసినట్లు తెలిపారు.ఇతనిపై మేడికొండూరు, ఒంగోలు తదితర ప్రాంతాలలో పదికి పైగా దొంగతనం కేసులు ఉన్నట్లు వివరించారు. ప్రసన్నకుమారి ఫిర్యాదును స్వీకరించిన భట్టిప్రోలు పోలీసులు ఎట్టకేలకు రేపల్లె డిఎస్పి అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు వేమూరు సిఐ నబీబ్ భాష ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఎస్.ఐ కే.అమీర్ జంగం సతీష్ ను,అంతర్ జిల్లాల దొంగతనాల కేసులో బాపట్ల సిసిఎస్ పోలీసుల సహకారంతో మణికంఠను, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.వేమూరు సిఐ నబీబ్ భాష ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఎస్ ఐ కే.అమీర్ అతి చాకచక్యంగా వ్యవహరించి ఇంటి ఎదురు ఉన్న దొంగను పట్టుకోవడంలోను, అంతర్ జిల్లాలో దొంగను పట్టుకోవడంలోనూ సఫలమయ్యారు. వారి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. త్వరలోనే వాటిని బాధితులకు అందజేస్తామన్నారు.అంతేకాకుండా డిఎస్పీ మాట్లాడుతూ



ప్రజలు తమ విలువైన వస్తువులను ఇంట్లో భద్రపరుచుకునే సమయంలో తాళం చెవులను ఇంటికి సమీపంలో ఉంచటం సరికాదన్నారు. నగదు నగలు తదితర వస్తువులను బ్యాంకులలో పదిలంగా భద్రపరుచుకోవాలన్నారు.ఒక్కో సమయంలో దొంగలు దొరికినప్పటికీ చోరీ సొత్తు రికవరీ కష్టసాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు అశ్రద్ధగా ఉండి తమ విలువైన వస్తువులను దొంగల పాలు కాకుండా కాపాడుకోవాలని సూచించారు.ఈ చోరీ కేసులో కీలకంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. త్వరలోనే వారికి ప్రోత్సాహకాలను ఇచ్చి అభినందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా దిగమర్రు,ఒంగోలు బైపాస్ రహదారి వెంబడి నిర్లక్ష్యంగా ప్రయాణం చేస్తూ పలువురు మృత్యువాత పడుతున్నారని డిఎస్పి తెలిపారు. ప్రయాణ సమయంలో అతివేగం ప్రమాదమని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను తప్పనిసరిగా వినియోగించాలని, వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు.వేగం కన్నా మనిషి ప్రాణం విలువైనదని గమనించి ప్రయాణ సమయంలో జాగ్రత్త వహించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో రేపల్లె డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ వేమూరు సిఐ నబీ భాష భట్టిప్రోలు ఎస్.ఐ కే.అమీర్ మరియు భట్టిప్రోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం



**పెన్ పవర్, కృష్ణాజిల్లా, కానూరు, ఆగష్టు 27:**
అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరు, తులసినగర్, యనమలకుదురు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు.ఒక్కో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు రూ.26 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కేంద్రాల్లో ఎనిమిది మంది సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. సుమారు 150 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు, అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే రూ.50 కోట్ల నిధులు కేటాయించినట్లు బోడె ప్రసాద్ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే మున్సిపాలిటీ పరిధిలో కృష్ణా నది నుంచి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సుమారు రూ.400 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలిచి, పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంకిపాడు మండలంలో డయేరియా కలకలం




**పెన్ పవర్, కృష్ణాజిల్లా, కంకిపాడు, ఆగష్టు 27:**
కంకిపాడు మండల పరిధిలో డయేరియా కేసులు కలకలం రేపుతున్నాయి. గత మూడు రోజుల్లో డయేరియాతో 20 మందికి పైగా కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినట్లు వైద్యులు తెలిపారు. వీరిలో 15 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించారు.ప్రస్తుతం ఆసుపత్రిలో ముగ్గురు డయేరియా బాధితులు చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు. కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే అస్వస్థతకు గురైనట్లు బాధితులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో డయేరియా కేసులు భారీగా నమోదవుతున్నాయంటూ వస్తున్న వార్తలను నమ్మవద్దని, వాటిని చూసి ప్రజలు ఆందోళనకు గురికావద్దని సూచించారు. ప్రజలు పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

# ఇరిగేషన్ కాలువలను ఆక్రమిస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి




**పెన్ పవర్, కృష్ణాజిల్లా, కంకిపాడు, ఆగష్టు 27:**
కంకిపాడు మండలం దావులూరు గ్రామంలో ఇరిగేషన్ కాలువ గట్టును కొందరు రియల్టర్లు ఆక్రమించి, అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొసనం రాము ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.విలేకరుల సమావేశంలో రాము మాట్లాడుతూ దావులూరు గ్రామంలోని పుల్లేటి కాలువ గట్టును కొందరు రియల్టర్లు ఆక్రమించారని ఆరోపించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, జిల్లా కలెక్టర్ ఆ ఫిర్యాదును కంకిపాడు మండల ఇరిగేషన్ ఏఈకి బదిలీ చేశారని తెలిపారు.అయితే ఫిర్యాదు చేసి నెలరోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని, కొందరు అధికారులు అక్రమ రియల్టర్లకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు.ఇరిగేషన్ కాలువ గట్టును రహదారిగా చూపిస్తూ వెంచర్లలో సామాన్యులకు ప్లాట్లు విక్రయిస్తున్నారని రాము ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్నాయని ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్యులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.సాగునీటి అవసరాలకు ఉపయోగపడే కాలువలను రహదారులుగా మార్చి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఫిర్యాదుపై ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులను ఆదేశించినప్పటికీ, కొందరు తప్పుడు సమాచారంతో ఉన్నతాధికారులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవడంతో పాటు, కాలువ గట్లను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కొసనం రాము కోరారు.

# సాయిబాబా ఆలయం లో పేదలకు అన్న దానం-వస్త్ర దానం



**భట్టిప్రోలు, పెన్ పవర్ ఆగస్టు, 27:**
బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలులో ఉన్న సాయిబాబా ఆలయం నందు ప్రతివారం వలెనే నేడు గురువారం కూడా పేదలకు అన్నదానం మరియు వస్త్ర దానం నిర్వహించడం జరిగింది.షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు భోజనం మానేపల్లి వెంకట మురళీకృష్ణ (విజయవాడ), జవ్వాది హేమ శంకరరావు,తమ్మన వెంకట సుబ్బారావు కుమారుడు సుమన్, కొల్లిపర నాగ వెంకట లక్ష్మీ దేదీప్య రవికాంత్ ఫ్యామిలీ, (హైదరాబాద్)స్వీట్ ను,కాళంగి వీర వెంకట పాండురంగారావు, మానేపల్లి వాగేష్ కుమార్(పులిహోర ప్యాకెట్లు),మాచర్ల లక్ష్మీ కాంతారావు కుమారుడు శ్రీనివాసరావు (శీతల పానీయములు) అందించినట్లు రమేష్ తెలిపారు. అంతేకాకుండా వారికి నూతన వస్త్రాలు,దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తమ్మన నాగభూషణం, చన్నా వెంకటేశ్వరరావు, బట్టు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి మెంటా సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్ కుమార్ జవ్వాది శ్రీనివాసరావు, మరియు మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: ప్రత్తిపాటి



చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :
చిలకలూరిపేట: కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.గురువారం నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధి నిధుల ద్వారా మంజూరైన ఆర్థిక సహాయంతో పాటు టీడీపీ ప్రమాద బీమా పథకం కింద మంజూరైన బీమా మొత్తాలను పట్టణంలోని తన నివాసంలో ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు.యడ్లపాడు మండలం జాలాది గ్రామానికి చెందిన పిల్లి ద్వారక రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, టీడీపీ ప్రమాద బీమా పథకం కింద మంజూరైన రూ.5 లక్షల బీమా మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.అలాగే తిమ్మాపురం గ్రామానికి చెందిన పావులూరి కోటేశ్వరమ్మకు అనారోగ్య చికిత్స నిమిత్తం రూ.91 వేల విలువైన ఎల్ ఓ సి , యడ్లపాడుకు చెందిన కరుచోల చిన్న పిచ్చయ్యకు రూ.లక్ష విలువైన ఎల్ ఓ సి, ఉన్నవ గ్రామానికి చెందిన ప్రత్తిపాటి దేవమణికి రూ.1.50 లక్షల విలువైన ఎల్ ఓ సి లను అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, బోలినేని శేఖర్, నాగ వర ప్రసాద్, టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘోర దుర్ఘటనలో ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరం : ప్రత్తిపాటి

- ప్రమాదంలో 7 గురు మరణించడం మిక్కిలి విషాదకరం.
- మృతుల కుటుంబాలకు అన్నివిధాల అండగా ఉంటాం.. ప్రభుత్వపరంగా వారిని ఆదుకుంటాం
- చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాద క్షతగాత్రుల్ని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :**
చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరమని, వేలూరు గ్రామానికి చెందిన 15 మంది ఆటోలో పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తూ, ప్రమాదానికి గురయ్యారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 12.45 గంటలకు ప్రమాదం జరిగిందని, దుర్ఘటనపై వెంటనే పోలీస్ వారిని, వైద్యాధికారుల్ని అప్రమత్తం చేశామని ఆయన చెప్పారు.ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నక్షతగాత్రుల్ని ప్రత్తిపాటి గురువారం ఉదయం పరామర్శించారు. బాధితులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడిన ఆయన, అధైర్యపడవద్దని, అన్నివిధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ప్రత్తిపాటి... బాధితులు కోలుకునేవరకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, గుంటూరు.. విజయవాడకు తరలించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.బుధవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించారని, చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రి, గుంటూరు జీజీహెచ్ లో చికిత్స పొందుతున్నవారిలో కొందరి పరిస్థితి విషమంగానే ఉందని, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యుల్ని ఆదేశించినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. దుర్ఘటన గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియచేశామని, మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరినట్టు ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే సీఎంవో అధికారులు, హోం మంత్రి అనిత అధికారులతో మాట్లాడారని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేటలో ఈ మధ్యకాలంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎప్పుడూ జరగలేదని, పొరపాటు ఎవరిదైనప్పటికీ పేద కుటుంబాలకు చెందిన ఏడుగురు చనిపోవడం దారుణమని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు.క్షతగాత్రుల్లో ముగ్గురు చిలకలూరిపేట ప్రైవేట్ ఆసుపత్రిలో, నలుగురు గుంటూరు జీజీ హెచ్ లో చికిత్స పొందుతున్నారని వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటనలో ఒక చిన్నపాప సురక్షితంగా బయటపడిందని ప్రత్తిపాటి చెప్పారు. మరణించిన ఏడుగురిలో 6 గురు 50 ఏళ్ల పైబడిన మహిళలని, ఒకరు పురుషలని, వారంతా ఘటనాస్థలంలోనే చనిపోయారన్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడి. అక్కడ చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించామన్నారు. మృతులు కుటుంబాలను ఆదుకోవడానికి అన్ని విధాలా సహకరిస్తామని.. ప్రైవేట్ ట్రావెల్స్ వారితో మాట్లాడి, తగిన పరిహారం అందించేలా చూడాలని ఆధికారుల్ని ఆదేశించామని ప్రత్తిపాటి తెలిపారు. టీడీపీ బీమా ఉన్న వారికి త్వరలోనే పార్టీ నుంచి సాయం అందుతుందన్నారు. మృతులు కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన ప్రత్తిపాటి.. ప్రభుత్వపరంగా ఆ కుటుంబాలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.



# 14 వ రోజు కు కంచి కామాక్షి అమ్మవారి ప్రత్యేక పూజలు



**భట్టిప్రోలు, పెన్ పవర్ ఆగస్టు, 27:**
మండల కేంద్రం భట్టిప్రోలు గ్రామంలో శ్రావణమాసం పర్వదినం సందర్భంగా శుక్ర వారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కంచి కామాక్షి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించబడుతున్నాయి.14 రోజైనా గురువారం తూనుగుంట్ల వంశీకృష్ణ--గౌతమి ల గృహములో శుక్ర వారోత్సవ కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూరెల అరుణ కుమారి నేతృత్వంలో సుత్తి శతకము,పారాయణ కామాక్షి అమ్మవారి అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ క్షేత్రపాలకుడు అయ్యప్ప స్వామి పూర్ణ పుష్కల సమేతంగా ఉంటారని.చేతిలో కొరడా ఉంటుందన్నారు.ఆలయములో తప్పు చేస్తే కొరడా దెబ్బ.ఏకకాలంలో వారాహి, రాజ్యశ్యామల దేవాలయం ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల లక్ష్మీపార్వతి, సుజాత,సునీత, మాటూరు గృహలక్ష్మి,మద్దుల నలిని,తూనుగుంట్ల వాణి,బొమ్మిశెట్టి వాణి,పెనుగొండ నాగరాజా,మాజేటి ప్రభావతి,కోట రేఖ, మానేపల్లి శైలజ కుమారి,పెండ్యాల భాగ్యలక్ష్మి,దరిశి శశికళ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ కు రాఖీలు కట్టిన పలువురు మహిళా నేతలు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 27,**
రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు మహిళా నేతలు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ కు రాఖీలు కట్టి ప్రేమను, సోదరభావాన్ని చాటుకున్నారు. గురువారం మంగళగిరి మోడ్రన్ రైతు బజార్ భూమిపూజ, శంకు స్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్ ను మహిళా నేతలు మర్యాదపూర్వకంగా కలసి రాఖీలు కట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్య, టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు వింజమూరి ఆషాబాల తదితరులు మంత్రి నారా లోకేష్ కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా అలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన.. ఎంతో ఆనందాన్ని కలిగించింది. : ప్రత్తిపాటి

**- బొప్పూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన గవర్నర్.**
**- రూ.10.99 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టిన పనులకు భూమిపూజ చేసి, వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్న అబ్దుల్ నజీర్.**
**- గ్రామ విశిష్టత, ఆలయ విశేషాలను స్వయంగా గవర్నర్ కు వివరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి**





చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :
బొప్పూడి కొండపై కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.10.99 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టిన పలు పనులకు గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణ మోహన్, జిల్లా న్యాయమూర్తి, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహా పలువురు ప్రముఖులతో కలిసి గొప్ప దైవకార్యంలో పాలుపంచుకోవడం మంచి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. గురువారం బొప్పూడిలో జరిగిన ఆలయాభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బొప్పూడి గ్రామ విశిష్టత, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ విశేషాలను ప్రత్తిపాటి స్వయంగా గవర్నర్ కు వివరించారు. తమ నియోజకవర్గంలో ఒక మంచి కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ కు ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.గురువారం చిలకలూరిపేట మండలం బొప్పూడి పర్యటనకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్ స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలో నిర్మించనున్న పుష్కరిణి పనులకు భూమిపూజ చేసిన ఆయన, అక్కడే ఏర్పాటుచేయనున్న గరుడ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ పండితుల వేదాశ్వీరచనం పొందారు. తర్వాత కొండపైకి వెళ్లే మెట్లమార్గం వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఆయన.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ లో పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఐజీ సర్వశ్రేష్ట త్రిపాటి, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జేసీ సంజన సిన్హా, ఆర్డీవో బాలకృష్ణ, కూటమి నాయకులు ఆడక స్వాములు, షేక్ కరిముల్లా, జవ్వాజి మధన్ మోహన్, అంబటి సొంబాబు, గుంటి కోటేశ్వరరావు, వలేటి లక్ష్మీ నారాయణ, వలేటి హిమవంతరావు, గ్రామ నాయకులు, అధికారు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నిరసన ర్యాలీ



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :**
చిలకలూరిపేట : పట్టణంలో రాత్రి చోటుచేసుకున్న ఘోర ఆటో ప్రమాద బాధితులను తక్షణమే ఆదుకుని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. బాధితులకు తక్షణ పరిహారం అందించాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలునిరసనను చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కళామందిర్ సెంటర్, చైత్ర సెంటర్ మీదుగా నరసరావుపేట సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం నరసరావుపేట సెంటర్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద ఘోర ప్రమాదం.. ఏడుగురు మృతి

## విషాద ఘటనపై శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 27 :**
చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద గురువారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందిన ఘటనపై శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మర్రి రాజశేఖర్



తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్న ఈ క్లిష్ట సమయంలో వారికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని మర్రి రాజశేఖర్ ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆయన వెంట జాలాది సుబ్బారావు, కొండ్రగుంట రామకృష్ణ, నార్నె హనుమంతరావు, దేవరకొండ గోపి, సయ్యద్ హిదాయతుల్లా, అత్తలూరి షరీఫ్ తదితరులు ఉన్నారు.

# జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలిజిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

**విజయవాడ: పెన్ పవర్,ఆగస్టు 27,**



ఒక నెల - ఒక నియోజకవర్గంశీ - నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 28వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.జగ్గయ్యపేట ఎస్.వి.ఎస్ కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.

# సాతులూరు లో శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నిర్మాణానికి 20లక్షల నిధులు విడుదల చేసిన ప్రత్తిపాటి పుల్లారావు


**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 27 :**
నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో నిర్మించనున్న వడియా రాజుల శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు విడుదలయ్యాయి.మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సహాయంతో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా దేవాలయాల నిర్మాణానికి కేటాయించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ నిధుల్లో భాగంగా సాతులూరులో నిర్మించనున్న కోదండరామస్వామి ఆలయానికి రూ.20 లక్షల నిధులను టీటీడీ దేవస్థానం మంజూరు చేసింది.ఈ నిధులను గురువారం ఆలయ కమిటీకి ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో నిర్వహించనున్న ఆలయ



నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రత్తిపాటి పుల్లారావును కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూ యజమానులకు ప్రయోజనం

## - భూముల సమగ్ర సర్వే, రికార్డుల పరిశీలనకు కలెక్టర్ ఆదేశాలు




**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 27:**
పాత ఎన్‌టీఆర్ పట్టాలు కలిగి ఉండి భూమిపై పూర్తి స్థాయిలో చట్టబద్ధమైన హక్కులు పొందలేక ఇబ్బందులు పడుతున్న భూ యజమానులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 20 వేల మంది భూ యజమానులకు ఈ ప్రక్రియ ద్వారా ప్రయోజనం కలగనున్నట్లు తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్‌టీఆర్ పట్టాల అమలు, అర్హులైన భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించే అంశంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాత పట్టాల్లోని వివరాలు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న భూమి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులు, సర్వే నంబర్లు తదితర వివరాలను నిర్ధారించి సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు.భూ యజమానుల వద్ద ఉన్న పాత పట్టాలు, ఇతర హక్కు పత్రాలను పరిశీలించడంతో పాటు రెవెన్యూ, సర్వే రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయాలని తెలిపారు. రికార్డుల్లో వ్యత్యాసాలు ఉంటే క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు.సర్వే, రికార్డుల పరిశీలన అనంతరం అర్హులైన భూ యజమానుల జాబితాను సిద్ధం చేసి, వారికి నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి, రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.దీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఎన్‌టీఆర్ పట్టాదారులకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, ఆర్డీఓలు వెన్నెల శ్రీను, జి. అనిల్ కుమార్, తహసీల్దార్లు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్లో పోలీసుల అవగాహన సదస్సు

**- సైబర్ క్రైమ్, డ్రగ్స్, సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన - మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: పోలీసులు**



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 27:**
బాపట్ల జిల్లా చీరాల మండలం కొత్తపేటలోని ఏపీ మోడల్ స్కూల్లో చీరాల రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చీరాల రెండో పట్టణ సీఐ ఏ. శశికుమార్, ఎస్ఐ కె.పి. రవీందర్, చీరాల సబ్ డివిజన్ శక్తి టీం సభ్యురాలు సీహెచ్. సునీత, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎన్. ఆంజనేయులు, సిబ్బంది, సుమారు 250 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ శశికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండడంతో పాటు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ మంచి నడవడికతో ముందుకు సాగాలని సూచించారు.మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని, మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు.ప్రస్తుత సమాజంలో చోటుచేసుకుంటున్న నేరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి చీరాల టౌన్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు. అవగాహన సదస్సు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

# డీఎస్సీ విజేతలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

- డీఎస్సీ ఫలితాలు యువతలో కొత్త ఆశలు నింపాయి
- ఉపాధ్యాయులుగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి: ఏలూరి



**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**
డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత సాధించిన మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన భూక్యా రవీంద్ర నాయక్, భూక్యా విజయ్ కుమార్ నాయక్‌లను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆత్మీయంగా కలిసి అభినందించారు. వారి విజయాన్ని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.డీఎస్సీ ద్వారా ప్రతిభ ఆధారంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఎంతోకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు డీఎస్సీ ఫలితాలు కొత్త ఆశలు, భరోసా కల్పించాయని పేర్కొన్నారు.యువత భవిష్యత్తుతో ముడిపడిన డీఎస్సీ వంటి అంశాలపై కూడా వైసీపీ తప్పుడు ప్రచారానికి పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు.కూటమి ప్రభుత్వం యువతకు మేలు చేసే ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింతగా పెంచే దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. డీఎస్సీలో విజయం సాధించిన రవీంద్ర నాయక్, విజయ్ కుమార్ నాయక్‌లు ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఇంటింటికీ తెలుగుదేశం.. ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే ఏలూరి

- దేవరపల్లి, నాగరాజుపల్లిలో ఇంటింటా పర్యటన
- కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించిన ఎమ్మెల్యే



**పర్చూరు, పెన్ పవర్, ఆగస్టు 27:**
పర్చూరు మండలం దేవరపల్లి, నాగరాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆత్మీయంగా కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, రైతులకు భరోసా, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పర్చూరు నియోజకవర్గంలో గత రెండేళ్లలో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవరపల్లిలో వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

- ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో భూమిపూజ
- సీజీఎఫ్ గ్రాంట్ కింద రూ.కోటి నిధులతో ఆలయ నిర్మాణం



**దేవరపల్లి, పెన్ పవర్, ఆగస్టు 27:**
పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో వేణుగోపాల స్వామివారి దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరై భూమిపూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో సీజీఎఫ్ గ్రాంట్ కింద రూ.కోటి నిధులు మంజూరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నిధులతో వేణుగోపాల స్వామివారి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే చూపిన చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఘనంగా సత్కారం: శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. పట్టు వస్త్రాలు సమర్పించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణం భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామ ఆధ్యాత్మిక, సామాజిక అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠలో మద్దులూరి మహేంద్రనాథ్





**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 27:**
చీరాల పట్టణంలోని గంజిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం:మాజీ మంత్రి నల్లపరెడ్డి

మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి కోవూరు మండల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కన్వీనర్లు, సీనియర్ నాయకులతో కలిసి పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ:



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 27.**
వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, అన్యాయాలు, అక్రమాల కారణంగా ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొందని అన్నారు.గత ఎన్నికల్లో జరిగిన పరిణామాలపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పద్ధతిలో తమ తీర్పును స్పష్టంగా వెల్లడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్, ఎస్పీ, రూరల్ డీఎస్పీ, టౌన్ డీఎస్పీ అధికారులపై తమకు పూర్తి గౌరవం ఉందని తెలిపారు. అయితే కింది స్థాయి అధికారులు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
కోవూరు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో ఎమ్మార్వో ఎంపీడీఓ , సీఐ , ఎస్ఐ స్థాయి అధికారులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులను భయపెట్టడం, బెదిరించడం, రౌడీషీట్లు పెడతామని హెచ్చరించడం వంటి విషయాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే అధికారులు ఎవరైనా ఉంటే వాటిని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో ప్రతి పార్టీకి, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అధికారులను కోరారు.కొన్ని మండలాల్లో కొంతమంది పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడే విధంగా అధికారులు వ్యవహరించాలని సూచించారు.వై.యస్. జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతూ పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.
ఇటీవల పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ మురళి నాయక్ తమ పార్టీ నాయకుల పట్ల అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలపై కూడా వారు స్పందించారు.
అధికారుల ప్రవర్తనపై తగిన విధంగా ఫిర్యాదు చేసి, చట్టపరమైన మార్గాల్లో ముందుకు వెళ్తామని తెలిపారు.
సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 8వ తేదీ నుంచి 11వ తేదీ మధ్య ఒకరోజు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామని, అలాగే ఆగస్టు 12వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు.
స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సి సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బస్సు ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి నారాయణ యాజమాన్యం భరోసా

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ**





**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 27:**
బస్సు నుంచి కిందపడి గాయపడిన నాలుగో తరగతి విద్యార్థి జాషువా డానియల్‌ను నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం పరామర్శించింది. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పింది.
అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాంజాషువా డానియల్ త్వరగా కోలుకునేలా అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం హామీ ఇచ్చింది. విద్యార్థి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తామని భరోసా కల్పించింది.

యాజమాన్యానికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

ప్రమాదం అనంతరం విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచి, సహాయం అందించేందుకు నారాయణ యాజమాన్యం ముందుకు రావడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ద

# చిన్న తప్పులతో మిస్ అయిన ఓట్లను సరిచేసేలా చొరవ

## రామన్నపేటలో ఓటు హక్కు కోసం ప్రత్యేక చర్యలు





**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 27:**
సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అన్న భావనతో ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేందుకు రామన్నపేట పంచాయతీలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని పార్వతిపురం, న్యూరోశయ్య కాలనీ, వినాయకపురం కాలనీలకు చెందిన కొంతమంది ఓటర్ల దరఖాస్తులు చిన్నచిన్న పొరపాట్ల కారణంగా తిరస్కరణకు గురయ్యాయి.
ఈ విషయాన్ని గుర్తించిన యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షులు, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు వేటగిరి సంజీవరావు చొరవ తీసుకుని తిరిగి వచ్చిన దరఖాస్తులను సేకరించారు. సంబంధిత ఓటర్లను మండల సచివాలయ అధికారుల వద్ద నిర్వహించిన విచారణకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు.

పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారినీ పిలిపించి

ఓటు హక్కు ఎక్కడా మిస్ కాకూడదనే ఉద్దేశంతో ఉపాధి, ఇతర పనుల నిమిత్తం గ్రామం వెలుపల ఉన్న వారిని సైతం సంప్రదించి అధికారుల వద్దకు తీసుకువచ్చారు. అనంతరం అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించి, అర్హులైన వారి ఓట్లను తిరిగి నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. రామన్నపేట సచివాలయం-1, సచివాలయం-2 పరిధిలోని ఓటర్లకు సంబంధించి ఈ ప్రక్రియ కొనసాగింది.

అధికారుల సమక్షంలో ప్రక్రియ

ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఎంపీడీవో, బీఎల్‌వీలకు సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న హౌసింగ్ అధికారి, వీఆర్వో అంబిక, సచివాలయ మహిళా కానిస్టేబుల్, వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
స్థానికంగా ఓట్లు మిస్ అయిన ఓటర్లతో పాటు మాజీ వార్డు మెంబర్ చౌటుటూరి లక్ష్మి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని, చిన్నచిన్న పొరపాట్లతో అర్హులైన వారి ఓట్లు కోల్పోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సంజీవరావు కోరారు.

# ఆరోగ్య సమస్యతో మందులు తీసుకుంటుండగా మృత్యువాత





- జనరిక్ మెడికల్ షాప్ వద్ద ఒక్కసారిగా స్పృహ కోల్పోయిన వృద్ధుడు
- ఆసుపత్రికి తరలించేలోపే మృతి.. కుటుంబంలో విషాదం

**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 27 :**
బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని సంఘం థియేటర్ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆరోగ్య సమస్యకు మందులు తీసుకుంటున్న ఓ వృద్ధుడు జనరిక్ మెడికల్ షాప్ వద్ద ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కిందపడిపోయి మృతి చెందాడు.
పర్చూరు నియోజకవర్గం కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన పాలపర్తి కోటేశ్వరరావు (75) తన భార్యతో కలిసి వ్యక్తిగత పనిమీద చీరాలకు వచ్చారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో సంఘం థియేటర్ సమీపంలోని జనరిక్ మెడికల్ షాప్ వద్ద ఆరోగ్య సమస్యకు సంబంధించిన మందులు తీసుకుంటుండగా ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కిందపడిపోయారు.దీనిని గమనించిన మెడికల్ షాప్ యజమాని వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది కోటేశ్వరరావును చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.